క్లుప్తంగా

సొంత గూటికి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు



ప్రణయ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న పార్టీ సానుభూతిపరులు

ఉరవకొండ: మండలంలోని నెరిమెట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరారు. వారు తిరిగి మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నెరిమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి, హనుమంతు, లింగప్ప ఆధ్వర్యంలో కురుబ వన్నూర్‌స్వామి, మంగలి ఓబులేసు, చాకలిమల్లప్ప తదితరులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. అయితే టీడీపీ నాయకులు తమను ప్రలోభపెట్టి పార్టీలోకి చేర్చుకున్నట్లు వారు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం వస్తే పథకాలు నిలిపివేస్తామని బెదిరించడంతో టీడీపీలోకి చేరామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రచారం



వజ్రకరూరులో ప్రచారం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ఉరవకొండ: నియోజకవర్గంలోని షేక్షానుపల్లి, వెంకటాంపల్లి, గుళపాల్యం గ్రామాల్లో వడ్డెర సంఘం తరఫున నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. కూడేరు సింగిల్ విండో అధ్యక్షుడు గంగాధర్, బూదగవి భీమేష్ బాబు, రామన్న, హంపయ్య, ఎర్రిస్వామి, మారుతి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీకి అండగా నిలవండి

వజ్రకరూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని వడ్డెర విభాగం నాయకులు కోరారు. మంగళవారం వెంకటాంపల్లి,గూళ్యపాళ్యం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ వడ్డెర విభాగం నాయకులు వైఎస్సార్‌సీపీ విజయం కోసం ప్రచారం చేశారు. కార్యక్రమంలో కూడేరు పీఏసీఎస్ అధ్యక్షుడు గంగాధర్, వడ్డె ర విభాగం నాయకులు భీమేష్, బాబు, హంపయ్య, రామన్న, హరి, ఎర్రిస్వామి, రవి, మారుతి పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోండి



సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు

విడపనకల్లు: వేసవిలో విద్యుత్, తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యలయం సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. రెవెన్యూ, ఉపాధి ఆరోగ్య, వ్యవసాయ తదితర శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు సమన్వయంతో పనిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య, వైస్ ఎంపీపీలు రాకెట్ల పుష్పావతి, మోదుపల్లి సునీత రాణి, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల అత్యుత్సాహం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో టీడీపీ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇటీవల టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఎస్‌ఆర్‌సీ అధినేత, కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబు పేరును అధిష్టానం ఖరారు చేసింది. ఆయన రెండు రోజుల్లో కళ్యాణదుర్గానికి రానున్న నేపథ్యంలో అనుచరులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఒంటిమిద్ది నుంచి కళ్యాణదుర్గంలోని పలు కూడళ్లలో రోడ్డు సిగ్నల్ బోర్డులకు అడ్డంగా అమిలినేని ఫ్లెక్సీలు, బోర్డులను ఏర్పాటు చేశారు. ఏకంగా సిగ్నల్స్ బోర్డును సైతం ఆక్రమించారు. అక్కమాంబ కొండ సమీపంలోని రింగ్ రోడ్డులో పట్టణం నుంచి వచ్చే వాహనాలు కనిపించకుండా కరెంటు స్తంభాలకడ్డంగా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ఫ్లెక్సీలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వన్నల్లిలో పశుగ్రాసం దగ్ధం

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వన్నల్లి గ్రామ శివారులో పశుగ్రాసం దగ్ధమైంది. వీఆర్‌ఓ రామన్న తెలిపిన మేరకు.. హెచ్. నాగరాజు అనే రైతుకు చెందిన 5 ఎకరాల పశు గ్రాసాన్ని గడ్డివాము వేశాడు. సాయంత్రం వేళలో ఉన్నపళంగా గడ్డివాముకు నిప్పంటుకుంది. ఉరవకొండ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట





రాయదుర్గంలో ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప , ఉరవకొండలో ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 2వ వార్డులో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

పేద ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం

శెట్టూరు: పేద ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ మంజునాథ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అయ్యగార్ల పల్లి గ్రామంలో ఆయన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఆయన 481 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ కార్డులతో పేదల ఆరోగ్యానికి భరోసా

ఉరవకొండ: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకంతో పేదల ఆరోగ్యానికి భరోసా కలిగిందని నెరిమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సచివాలయంలో నూతనంగా మంజూరయిన ఆరోగ్యశ్రీ డిజిట్ కార్డులు పంపిణీ చేశారు.

7,425 ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డుల పంపిణీ

కూడేరు: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో మంగళవారం నాటికి 7,425 కార్డులను ప్రజలకు అందించినట్లు ఎంపీడీఓ ఎంకే బాషా, మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. 9,579 ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు ప్రభుత్వం నుంచి వచ్చాయి. కూడేరు సచివాలయం-1లో 943 సరఫరా కాగా 863 పంపిణీ చేశారు. చోళసముద్రంలో 783 రాగా 673, కూడేరు-2లో 662 గాను 580, ఇప్పేరులో 1,517 గాను 1247, పి.నారాయణపురంలో 7,88 గాను 460, గొటుకూరులో 604గాను 280, ఉదిరిపికొండలో 378 గాను 315, కమ్మూరులో 1,019 గాను 853, మరుట్లలో 1,326 గాను 1118, తిమ్మాపురంలో 609 గాను 555, కొర్రకోడులో 950గాను 481 మందికి పంపిణీ చేశారు.

కనకదుర్గమ్మ సేవలో మెట్టు గోవిందరెడ్డి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మెట్టు

రాయదుర్గం: విజయవాడ ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ సేవలో రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తరించారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల సమావేశానికి వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్‌తో పాటు ఐదు మండలాల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో హాజరయ్యారు. అనంతరం వారితో కలిసి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం మెట్టు మాట్లాడారు. ఎన్నికల రణక్షేత్రానికి సిద్ధమైనట్లు ప్రకటించారు. దుర్గమ్మతల్లి ఆశీస్సులతో రేపటి నుంచి ప్రచారం ముమ్మరం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు వన్నూర్‌స్వామి, గౌని కాంతారెడ్డి, రామాంజనేయులు, హొన్నే మల్లికార్జున, టీ కేశవరెడ్డి, సచివాలయ కన్వీనర్లు రాళ్ల తిమ్మారెడ్డి, ఆంజనేయులు, కేపీదొడ్డి సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

అజెండా అంశాలు ఏకగ్రీవంగా ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో సమస్యలను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మంగళవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత సమావేశంలో అజెండాలోని అంశాలను, తీర్మానాలను సిబ్బంది చదివి వినిపించారు. అనంతరం అజెండాలోని పలు అంశాలపై కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, బండి అజయ్, పెద్ద వన్నూరుస్వామి, శ్రీనివాసరెడ్డి కొన్ని సందేహాలను లేవనెత్తారు. 8వ అంశంపై కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేసి, వాయిదా వేయించారు. ఒక అంశం వాయిదాతో అజెండాలోని మిగితా అన్ని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన జీరో అవర్స్‌లో కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, గోవిందరాజులు తదితరులు పట్టణంలో వీధి దీపాల కొరతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ పలుమార్లు కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చామని, మరో వారంరోజుల్లో వీధి దీపాల సమస్య పరిష్కరిస్తామన్నారు. పట్టణంలో ఫాగింగ్ యంత్రం పనిచేస్తుందా లేదా అని శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్ దృష్టికి తెచ్చారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అమృత్ కింద పట్టణంలో నీటి ట్యాంకుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కౌన్సిలర్ అజయ్ కోరారు. సమావేశంలో కమిషనర్ షేక్‌మాలిక్, మేనేజర్ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, అకౌంటెంట్ ఈశ్వర్, ఆర్‌ఓ కొండన్న, ఏఈ కోదండ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

‘మేము సిద్ధం’ సమావేశానికి వెళ్లిన విశ్వ



మేము సిద్ధం సభకు హాజరైన విశ్వ, నాయకులు

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో జరిగిన మేము సిద్ధం..మా బూత్ సిద్ధం సమావేశానికి ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తరలి వెళ్లారు. ఆయనతోపాటు బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సీపీ వీరన్న, ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, బెళుగుప్ప, కూడేరు, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల పార్టీ అధ్యక్షులు, ఆయా మండలాల జేసీఎస్ కన్వీనర్లు మూస్తురు సుంకన్న, ఏసీ ఎర్రిస్వామి, మూలగిరిపల్లి ఓబన్న, మచ్చన్న, బైరెడ్డి రామచంద్రారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, బసన్న, భరత్‌రెడ్డి, దేవేంద్ర, శ్రీనివాసులు, ఉస్మాన్, నాయకులు పెద్దిరెడ్డి హాజరయ్యారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

వజ్రకరూరు: వజ్రకరూరు నుంచి బొలెరో వాహనంలో పాల్తూరుకు వెళ్తూ టైరు పగిలి ఉరవకొండ పరిసర ప్రాంతంలో సోమవారం కూలీలు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. మంగళవారం అనంతపురం, ఉరవకొండ ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఫోన్లో పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రుల వైద్యాధికారులతో మాట్లాడారు.

1 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు



జూనియర్ కళాశాలలో హాల్ టికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ వీరేష్

రాయదుర్గంటౌన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 20 వరకు జరగనున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలల్లో (మోడల్ స్కూల్) పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు దాదాపు 1,975 మంది హాజరుకానున్నారు. వీరిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరానికి చెందిన 894 మంది విద్యార్థులు, మోడల్ స్కూల్‌లో 128 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 444 మంది, కేజీబీవీలో 77 మంది విద్యార్థులు రాయనున్నారు. మార్చి 1న మొదటి సంవత్సరం విద్యార్థులకు, 2 నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే విద్యార్థులు హాజరుకావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్, మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ తోటా వెంకటేశులు తెలిపారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు రాయదుర్గంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నాయి. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు వాటిని పరిశీలించి, స్ట్రాంగ్ రూముల్లో భద్ర పరిచారు. మొత్తం మూడు సెట్ల పరీక్షా పత్రాలు చేరుకున్నట్లు చెప్పారు.

‘పల్స్ పోలియో విజయవంతం చేద్దాం’



పోలియో చుక్కలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రిహజైనం



వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మార్చి 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. మంగళవారం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని పీహెచ్ సీలో పల్స్‌పోలియో కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఐదేళ్ల లోపు చిన్నారులు 4,973 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు , ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం సమావేశం నిర్వహించారు. వైద్యాధికారిణి గీతాభార్గవి మాట్లాడుతూ మార్చి 3న పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలు 2,814 మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఎంపీహెచ్ఈఓ శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాదేవి, బాలాజీ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మార్చి 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై కురాకులతోటలోని పీహెచ్‌సీలో అంగన్‌వాడీ సిబ్బందికి వైద్యులు రాజేష్, డాక్టర్ రిహజైనం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా రాజుల దేవర



అడిగుప్పలో ఊరేగుతున్న రాజులదేవర

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్పలో రాజుల దేవర ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను జలధికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఘనంగా ఊరేగించి, మొక్కులు తీర్చుకున్నారు. వాల్మీకుల కులదైవాన్ని దర్శించేందుకు భక్తులు పోటెత్తారు.

భక్తిమార్గంతోనే ఉత్తమ జీవితం

అనంతపురం కల్చరల్: భక్తిమార్గంతోనే మానసిక ప్రశాంతత కలిగి ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోవిందానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. నగరంలోని కామితార్థ గణపతి ఆలయంలో జరుగుతున్న విగ్రహ పునః ప్రతిష్టకు స్వామీజీ హాజరై అనుగ్రహ భాషణం చేశారు. ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అంతకు ముందు ఆలయంలో షోడచోప చారపూజలు, వేదపారాయణం, గణపతి, నవగ్రహ, రుద్ర, అరుణ, దుర్గా పారాయణాలు, మూలమంత్ర జపాలు ఘనంగా జరిగాయి. అనంతరం చిన్నారులు శాస్త్రీయ నాట్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం కర్ణాటకలోని గోపాలకృష్ణ మఠం నుంచి నగరానికి విచ్చేసిన స్వామీజీకి కాశీవిశ్వేశ్వర కోదండరామాలయ అనువంశిక ధర్మకర్త హోసూరు రామసుబ్రమణ్యం ఇంట్లో విడిది చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామీజీ గురు పాదపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు సుంకేశుల సత్యనారాయణ మాట్లాడుతూ బుధవారం ఆలయంలో స్వామీజీ చేతుల మీదుగా సర్వదేవతల పునః ప్రతిష్టలుంటాయన్నారు.

‘స్పందన’కు 15 ఫిర్యాదులు

అనంతపురం మెడికల్: డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందన కార్యక్రమాన్ని 15 ఫిర్యాదులు వచ్చాయి. ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత వివిధ పీహెచ్‌సీ, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఫిర్యాదులు స్వీకరించారు. జీతాల విషయానికి సంబంధించి హెడ్ అకౌంట్, తదితర వాటిలో మార్పులు చేసి సకాలంలో జీతాలందించేలా ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏఓ గిరిజామనోహర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించండి

ఆత్మకూరు: వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు ప్రజలకు సూచించారు. మంగళవారం పి.యాలేరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని సబిహా సుల్తానా సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరోగ్యం రెడ్డి, వైస్ ఎంపీపీ నీలిమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనకొండ్లలో రెండిళ్లలో చోరీ

వజ్రకరూరు: కొనకొండ్లలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన మేరకు.. కొనకొండ్లకు చెందిన రామాంజనేయులు, కొండజోగుల నారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 23న గుత్తి మండలం తొండపాడుకు వెళ్లారు. తిరిగి సోమవారం ఇంటికి వచ్చి చూడగా, బీరువాలను ధ్వంసం చేసి ఉంది. అందులోని బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుల కష్టనష్టాలపై అవగాహన అవసరం

రాయదుర్గం రూరల్: ఆరుగాలం శ్రమిస్తూ పంటలు పండించే రైతుల కష్ట, నష్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ , డిగ్రీ కళాశాలల విద్యార్థులకు రైతు రక్షణ వేదిక వ్యవస్థాపకులు గౌని ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ అన్నదాతల సమస్యలు- వాటి పరిష్కార మార్గాలు అనే అంశంపై వ్యాసరచన , వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం 20 మందికి బహుమతులు అందజేశారు. ప్రిన్సి పాల్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

కణేకల్లు: కణేకల్లు సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం వేస్తున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకిశోర్ ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.3వేల నిర్ణీత రుసుం చెల్లించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్‌కు రూ.20 వేల అపరాధ రుసుం

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం వద్ద అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై రూ.20వేల అపరాధ రుసుం వేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన చంద్ర అనే వ్యక్తి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా కిశోర్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా పి.కిశోర్‌ను ఉన్నతాధికారులు నియమించారు. ఈ మేరకు తాజాగా డీఎంఏ నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినట్లు మున్సిపల్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా చేస్తున్న కిశోర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న షేక్‌మాలిక్‌ను డీఎంఏ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ ఉత్వర్వులు జారీ అయినట్లు చెప్పారు. రెండు, మూడు రోజుల్లో నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

సురక్షిత నీటిని అందించడమే లక్ష్యం



హరేసమద్రంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని జిందాల్ సావ్ యూనిట్ హెడ్, ప్రెసిడెంట్ సౌమ్యజ్యోతి సర్కార్ అన్నారు. మంగళవారం మండలంలోని హరేసముద్రం పరిధిలో ఉన్న జిందాల్ సావ్ లిమిటెడ్ యాజమాన్యం హరేసముద్రం, బొల్లనగుడ్డం గ్రామాలకు ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిందాల్ బీఎఫ్ ఆపరేషన్ హెడ్ మాధవన్ కుమార్, లీగల్, లైజన్ హెడ్ సుభానీ, హెడ్ హెచ్‌ఆర్ రవికుమార్, సర్పంచులు తిప్పేస్వామి, గాదిలింగ పాల్గొన్నారు.

పేదలకు ‘ఆరోగ్య సురక్ష’ వరం



హెల్త్ క్యాంపులో రక్తపరీక్షలు చేయించుకుంటున్న దృశ్యం

కణేకల్లు: ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ పేదలకు వరం లాంటిందని సర్పంచు శారద అన్నారు. మంగళవారం జక్కలవడికి గ్రామంలో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం జరిగింది. వైద్యశిబిరంలో డాక్టర్లు విజయకుమార్‌నాయక్, పావతి, చంద్రశేఖర్, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ ఇజాజ్‌హుసేన్‌లు 497 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతరెడ్డి, టైలర్ వెంకటేశులు, గిర్రప్పరెడ్డి, భీమిరెడ్డి, బోయ బలరాం, బోయ రామకృష్ణ పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’కు స్పందన



షేక్షానుపల్లిలో పేదలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఉరవకొండ: మండలంలోని షేక్షానుపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కౌకుంట్ల పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఆరోగ్యసురక్ష శిబిరం మంగళవారం ఏర్పాటు చేశారు. మొత్తం 500 మందికి వివిధ రకాల వైద్య నిపుణులు పరీక్షలు చేశారు. గైనకాలజిస్టు డాక్టర్ శైలజ, డాక్టర్ రాజేష్‌నాయక్, జనరల్ సర్జన్ డాక్టర్ మనోజ్ఞ, ఆర్థోపెడిస్టు డాక్టర్ కిశోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ రమణ, ఎంపీహెచ్ఓ గోవిందు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమలం హెల్త్ అసిస్టెంట్స్ ప్రసాద్‌రావు, నాగరాజు, వరలక్ష్మి, ఎఎస్ఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందరికీ వైద్య సేవలు



కురువల్లిలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి

బొమ్మనహాళ్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారంమండలంలోని కురవల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యుగేంధర్, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్, రమణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలవాలని ప్రార్థనలు



ఎల్లార్తి దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలవాని కర్నూలు జిల్లా హోలగొంద మండలంలో ఎల్లార్తి షాషా, షేక్షావలి దర్గాలో మంగళవారం నాయకులు ప్రార్థనలు చేశారు. మైనార్టీ నాయకులు కణేకల్లు యూసుఫ్, కరీముల్లా, మస్తాన్‌వలి, హుసేన్‌పీరా, మహబూబ్ బాషా తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కొనకొండ ఉపసర్పంచు రాజీనామా



ఎంపీడీఓ విజయలలితకు రాజీనామా అందిస్తున్న హరి ప్రసాద్

వజ్రకరూరు: కొనకొండ్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచు చిన్నలింగన్నగారి హరిప్రసాద్ తన పదవికి రాజీనామా చేశాడు. ఎంపీడీఓ విజయలలితను కలిసి తన రాజీనామా చేస్తున్నట్లు లేఖ అందించాడు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో ఉపసర్పంచు పదవికి రాజీనామా చేసినట్లు తెలిపాడు.

రూ.37 వేలకు బండి మోటు వేలం

రాయదుర్గం రూరల్: మండలంలోని ప్రసిద్ధ మద్దానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 11 నుంచి ప్రారంభం కానున్నాయి. పదిరోజుల పాటు పశువుల జాతర జరుగుతుంది. జాతరకు వచ్చే పశువులకు నామమాత్రపు సుంకం (బండుమోటు) వసూలు చేయడానికి ఆలయాల కార్యనిర్వాహణ అధికారి నరసింహారెడ్డి మంగళవారం బహిరంగ వేలం వేశారు. 74 ఉడేగోళం గ్రామానికి చెందిన కె.నాగరాజు బహిరంగ వేలంలో రూ.37 వేలకు బండిమోటు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బసవరాజు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు జయణ్ణ, మహానంది, గురుశిద్దప్ప, ధరణేష్ , తిప్పేరుద్రప్ప, ఉలుగప్ప, గోవిందప్ప, సీఎం నాగప్ప తో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.